క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం


వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పాములపాడు: మాజీ ప్రధాని అటల్‌బీహారీ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్రనాయకుడు చల్లాదామోదర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం పాములపాడులో వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీ మోహన్, హేమచంద్ర, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుడికి డాలర్ అప్పగింత


డాలర్‌ను భక్తుడికి అందిస్తున్న ఏఈఓ, హోంగార్డు

మహానంది: హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్, కుటుంబ సభ్యులు బుధవారం మహానందికి వచ్చారు. స్థానిక చిన్న కోనేరులో స్నానం ఆచరిస్తుండగా రాజశేఖర్ చేతికి ఉన్న బంగారు డాలర్ కోనేరులో పడిపోయింది. విషయాన్ని హోంగార్డు శివరామ్‌రాయల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన చెంచు యువకుల చేత వెతికించి దొరికిన డాలర్‌ను ఏఈఓ ఎరమల మధు ఆధ్వర్యంలో భక్తుడు రాజశేఖర్‌కు అందించారు.

చండీయాగానికి నేడు పూర్ణాహుతి

బనగానపల్లె రూరల్ : మండంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్న చండీయాగం గురువారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ బుధవారం తెలిపారు. చండీయాగంలో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదపండితులు శివుడు, యాగశాలలో ఏర్పాటు చేసిన చౌడేశ్వరిదేవి ఉత్సవమూర్తికి వేదమంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

కిరాణాషాపులో చోరీ

కోవెలకుంట్ల: పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో మంగళవారం అర్ధరాత్రి ఓ కిరాణా కొట్టులో చోరీ జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన రాజేష్ రాత్రి కిరాణా షాపు షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు షట్టర్‌కు వేసిన తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్ టేబుల్‌లో ఉన్న రూ. 8 వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లను అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం షాపుకు వచ్చే సరికి షట్టర్ తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. చోరీ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గడ్డివామికి నిప్పు


కాలిపోయిన వరి గడ్డి

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్ల భాస్కర్ రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ నాయుడుకు చెందిన గడ్డివామి అగ్నికి ఆహుతైంది. పాడి పశువుల కోసం నిల్వ చేసుకున్న వరి గడ్డికి మంగళవారం రాత్రి నిప్పు రాసుకొని మంటలు చెలరేగడంతో బాధిత కుటంబసభ్యులు ఇంటికి ఉన్న బోరు పైపుతో నీటిని చల్లి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.80 వేల విలువ చేసే వరి గడ్డి కాలిపోయినట్లు బాధితులు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టినట్లు బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- గీతాలాపనలతో మారుమోగిన చర్చిలు
- యేసు జననం ప్రాముఖ్యతను వివరించి పాస్టర్లు

నందికొట్కూరు: క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దేవుడి కుమారుడు యేసుక్రీస్తు జనానాన్ని పరస్కరించుకుని నిర్వహించే క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. ఆయా చర్చీలలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన ప్రార్థనలు బుధవారం కొనసాగాయి. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలు, గీతాలతో చర్చిలు మారుమోగాయి. కేక్‌ల కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుసుకున్నారు. మండల కేంద్రం నందికొట్కూరుతోపాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడకల సంబరాలు అంబరాన్నంటాయి. ఆయా చర్చిలలో పాస్టర్లు యేసుక్రీస్తు జననం ప్రాముఖ్యతను వివరించారు. యేసు ప్రభువు చూపిన సన్మార్గంలో నడిచి ఆయన కృపకు పాత్రులవ్వాలని పిలుపునచ్చారు. పాపులను రక్షించేందుకే ఈ లోకానికి ఏసుక్రీస్తు వచ్చారని సీఎస్‌ఐ టౌన్ చర్చి రెవరెండ్ ఫాదర్ శ్యామల్ రత్న రాజ్ పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రెవరెండ్ గాంధీ, సీఎస్‌ఐ టౌన్ చర్చి కార్యదర్శి బందెల జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్రబాబు, ఆర్‌సీఎం చర్చి సంఘం పెద్దలు, ఏబీఎం సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల కేంద్రం పగిడ్యాలతోపాటు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.


పాములపాడు: ఏసుక్రీస్తు ప్రార్థనగీతాలను ఆలపిస్తున్న క్రైస్తవులు

పాస్టర్లు రాజేష్, సమూయేలు యేసుక్రీస్తు జననం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్తపల్లి సీఎస్‌ఐ సంఘ పాస్ట్రేట్ చైర్మన్ భరత్‌దివాకర్ బాబు, ఆర్సీఎం సంఘ ఫాస్టర్ బెర్నాల్డ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతోపాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏబీఎం, సీఎస్‌ఐ తదితర చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిడుతూరు, తలముడిపి గ్రామాల్లోని ఏబీఎం చర్చీలలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాతో పాటు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లకు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. యేసు సూచించిన సన్మార్గాన్ని అలవర్చుకోవాలని ఫాదర్ బాలయేసు సూచించారు.


నందికొట్కూరు: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


పాములపాడు: ప్రార్థనల్లో పాల్గొన్న దృశ్యం

పాములపాడు: మండల కేంద్రం పాములపాడుతో పాటు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. స్థానిక జేరుషలేం శాలలో బ్రదర్ సంసోస్ ఎఫ్రా యేసు జననం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం నూతన జీసస్ సర్వలోకనాథుడా పాటల సీడీని ఆవిష్కరించారు. ఏసుక్రీస్తు జన్మదినం నాటకం ఆకట్టుకుంది.


నందికొట్కూరు: చర్చి చుట్టు సిలువతో తిరుగుతున్న దృశ్యం


పగిడ్యాల: ప్రార్థనా మందిరంలో కేక్ కట్ చేస్తున్న సంఘ పెద్దలు


కొత్తపల్లి: గువ్వలకుంట్లలో శిలువలు పట్టుకుని ప్రధాన వీధిలో గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

ఆత్మకూరు: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఇందిరానగర్‌కు చెందిన సీఎస్‌ఐ ప్రార్థనా మందిరంతోపాటు ఏబీఎం పాలెం, ఎస్పీజీ పాలెం, పాత బస్టాండు, సంగమేశ్వర సర్కిల్ తదితర కాలనీల్లోని ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. ప్రతిఒక్కరూ మంచిమార్గంలో నడవాలని, ధర్మం, శాంతి, సౌభాగ్యాల మధ్య మెలగాలన్నారు. అలాగే అమలాపురం గ్రామంలో క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ బాషా పోగుల దరగయ్య క్రీస్తు జన్మదిన విశేషాలను క్రైస్తవులకు వివరించారు. పాస్టర్ కోటేశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: మానవాళికి ప్రేమను పంచడం కోసం ఏసుక్రీస్తు జన్మించాడని సున్నిపెంట ఆంధ్రా బాప్టిస్ట్ మిషనరీ పాస్టర్ రెవరెండ్.జి.కిరణ్‌కుమార్, ఫీల్డ్ అధ్యక్షులు జనుకుటి జాన్‌బాబు తెలిపారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రైస్తవులను ఉద్దేశించి వారు దైవ సందేశం వినిపించారు. అనంతరం యువకులు ప్రత్యేక గీతాలను ఆలపించారు.


ఆత్మకూరు: దేవుని సందేశం వినిపిస్తున్న పాస్టర్


ఆత్మకూరు: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


శ్రీశైలంప్రాజెక్ట్: క్రీస్తుకు స్తుతులు అర్పిస్తున్న క్రైస్తవులు

– వెలుగోడు: క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెలుగోడు,వేల్పనూరు,రేగడ గూడూరు, మోత్కూరు, మాధవరం అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో క్రైస్తవులు బుధవారం భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, పెంతే కోస్తు ఫాదర్‌లు సతీష్, రోయి, మైకేల్ శ్యామ్ సుందర్ బాబు, పిడుగు పేతురు చర్చిల్లో తెల్లవారుజాము నుంచి ఆరాధనతో వేడుకలను ప్రారంభించి దైవ సందేశాన్ని వినిపించారు.

– మహానంది: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం వేడుకలు వైభవంగా జరిగాయి. మహానంది మండలం గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ మనోవికాస్ కేంద్రంలో కరస్పాండెంట్ సిస్టర్ రీనా జోష్ ఆధ్వర్యంలో పండుగ ఘనంగా చేశారు. గోపవరం, గాజులపల్లె, తిమ్మాపురం, మసీదుపురం, బుక్కాపురం, బొల్లవరం, అబ్బీపురం, సీతారామపురం, తమ్మడపల్లె, నందిపల్లె, గాజులపల్లె ఆర్‌ఎస్, అల్లినగరం, తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి.

ఘనంగా మాజీ ప్రధాని శత జయంతి

ఆత్మకూరు: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు బుధవారం పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు సాంబశివగౌడ్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి ఒక రాజకీయవేత్త మాత్రమే కాదని, రాజనీతిజ్ఞుడు, గ్రామీణ సడక్‌యోజన, సర్వశిక్ష అభియాన్, ఫోఖ్రాన్ పరీక్షలతో భారత్‌ను ఒక శక్తిగా మార్చి నిజమైన సుపరిపాలన ఎలా ఉంటుందో చూపిన మహానీయుడని కొనియాడారు. ప్రతిఒక్కరూ వాజ్‌పేయి అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మోడీబాషా, మండల నాయకులు గోపాల్, నూర్‌బాషా, మహేష్‌బాబు, అస్మతుల్లా పాల్గొన్నారు.


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం ఓర్వకల్లులో బుధవారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పాల పళ్ల విభాగం ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక ఏబీఎం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వైఎస్సార్ సీపీ నేత కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. 17 జతల ఎద్దులు పోటీపడగా యువత కేరింతల మధ్య ఉత్సాహంగా సాగాయి. తెలంగాణ రాష్ట్రం, నాగర్‌కర్నూలు జిల్లా, రామవరం రామచంద్రారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలువగా దివంగత కాశిరెడ్డి వెంగళరెడ్డి కుమారులు కాశిరెడ్డి స్వామిరెడ్డి, కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సంయుక్తంగా రూ. 35 వేలు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన పాణ్యం మండలం, పిన్నాపురం వెంకటకృష్ణయ్య వృషభాలు రూ.30 వేలు, మూడవ స్థానంలో నిలిచిన వనపర్తి మండలం, పెద్ద దగడ పోగుల యశ్వంత్, పుత్తనూర్ పెద్దింటి నరేష్(ఉభయజత) వృషభాలు రూ.20 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన ఆళ్లగడ్డ మండలం బిల్లలాపురం భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు రూ.10 వేలు కై వసం చేసుకున్నాయి. అదేవిధంగా గురుజాల ధరని చౌదరి వృషభాలు, బి.తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం వృషభాలు, అనంతపురం జిల్లా, ఆత్మకూరుకు చెందిన విశ్వనాథ్ రెడ్డి వృసభాలు సమానంగా లాగి ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో నిలిచి రూ. రూ.3,300 చొప్పున బహుమతులు కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర రెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చేట్ల రాజు, దానమయ్య, రెడ్డిపోగు ఆశీర్వాదం పాల్గొన్నారు.

నేడు పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే సమావేశం

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

వెలుగోడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ కో–ఆపరేటివ్ సొసైటీ వెలుగోడు రేగడగూడూరులో బ్యాంకు ఖాతా కలిగిన రైతులకు ఈకేవైసీ తప్పనిసరి అని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ కో–ఆపరేటివ్ సొసైటీ బ్యాంకులలో ఖాతాలను ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. 4,265 మంది రైతులు ఖాతాల సవరణకు సంబంధిత గ్రామ సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ముగిసిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా పోటీలు సాగాయి. స్థానిక సీఐ రమేష్‌రెడ్డి, బెలుంకు చెందిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఫైనల్ మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శివ టీం మొదటి స్థానాన్ని కై వసం చేసుకోగా, తాడిపత్రికి చెందిన టీసీఈ స్పోర్ట్ క్లబ్ టీం రెండో స్థానంలో నిలిచింది. కొలిమిగుండ్ల మహేష్ టీం మూడవ స్థానం, బనగానపల్లెకు చెందిన టార్గెట్ టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో సీఐల చేతుల మీదుగా రూ.20,016, రూ. 15,016, రూ.10,016,రూ.5016ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు సర్పంచ్ నీలం మారమ్మ, కొలిమిగుండ్ల ధనరాజు, ఏసేయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిప్పర్ల జోరు..రైతులు బేజారు

- రహదారి వెంట పైర్లపై దుమ్ము
- పంట దిగుబడి వచ్చే అవకాశం లేదంటున్న రైతులు
- పట్టించుకోని కంపెనీ ప్రతినిధులు

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనుల కోసం పదుల సంఖ్యలో ట్రిప్పర్లు రాకపోకలతో రైతులు బేజారవుతున్నారు. కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామం నుంచి మట్టిని ట్రిప్పర్లలో ఆత్మకూరుకు తరలిస్తున్నారు. రోజుకు 50 టిప్పర్ల వరకు రాకపోకలు సాగిస్తూ ఉండటంతో పైర్లపై దుమ్మూధూళీ చేరుతోందని, పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. రహదారికిరువైపులా సుమారు 400 ఎకరాల్లో మినుము, మొక్కజొన్న, మిరప సాగు చేశారు. దుమ్ము తాకిడి ఎక్కువై పైరుకొమ్మలకు పూత రావడం లేదని, మొక్క పెరుగుదల కూడా క్షీణిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కంపెనీ వారికి పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు.


ట్రిప్పర్లను అడ్డుకున్న రైతులు(ఫైల్


మినుము మొక్కల పై పడిన దుమ్ము

ముగిసిన కొచ్చెర్వు గ్రామ దేవర


పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి

డోన్: మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో 20 ఏళ్ల తర్వాత బుధవారం నిర్వహించిన పెద్దమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు, బంధుమిత్రులు, స్నేహితులు, సన్నిహితులతో గ్రామం కిక్కిరిసిపోయింది. మేజర్ గ్రామ పంచాయతీ కొచ్చెర్వు గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు, సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రతి ఇంటికి బూత్‌బిల్లి అనే వ్యక్తితో పాలి(జొన్న అన్నం) చల్లించుకున్నారు. గ్రామ దేవర సందర్భంగా మంగళ, బుధవారాలు అటు రాయలచెరువు రోడ్డు, ఇటు డోన్ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, మధుసూదన్‌రావ్‌లతో పాటు ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన శేషుగాళ్ల రమేష్, భార్య కుమారిపై దాడి చేయడంతో గాయపడగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. వివరాలు.. దంపతులిద్దరూ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చర్చికి ప్రార్థన కోసం బయలుదేరారు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన ముసలిగాళ్ల ప్రసాద్, నాగార్జున పాత కక్షలు మనసులో పెట్టుకుని రమేష్, కుమారిలను దుర్భాషలాడి దాడి చేయడంతో రమేష్‌కు తలకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

నాణ్యత నగుబాటు

- రహదారుల నిర్మాణంలో అరకొరగా క్యూరింగ్
- లోపించిన అధికారుల పర్యవేక్షణ



సాయివిజయ ఇంటి ముందు సంధులో వేసిన సీసీ రోడ్డులో ఒట్టిపోయిన కట్టలు, గుండు తూము పాఠశాల సమీపంలోని సీసీ రోడ్డుకు క్యూరింగ్ లేని దుస్థితి

పగిడ్యాల: కాసులకు కక్కుర్తిపడిన కాంట్రాక్టర్లు క్యూరింగ్‌కు తిలోదకాలిచ్చారు. అమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు పర్యవేక్షణ మరిచారు. ఫలితంగా రహదారుల నాణ్యత నగుబాటవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లబ్ది చేకూర్చేలా నామినేటెడ్ కింద అప్పగించిన సీసీ రోడ్డు పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. నాణ్యత ప్రమాణాలను ఏ కోశాన కూడా పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా నాసిరకంగా సీసీ రోడ్లు వేస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని నెహ్రూనగర్‌లో జరిగే సీసీ రోడ్లే అద్దం పడుతున్నాయి. పనులు దక్కించుకున్న గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు కమీషన్‌లకు ఆశపడి పనులను సబ్ కాంట్రాక్టర్‌లకు అప్పగించినట్లు తెలుస్తోంది. సబ్ కాంట్రాక్టర్ కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు కమీషన్‌లు సమర్పించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పనులు నాసిరకంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలానికి ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.2.5 కోట్లు మంజూరు కాగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. అయితే సీసీ రోడ్డు పనుల్లో ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. కనీసం 3 మీటర్ల వెడల్పు, 7 ఇంచుల ఎత్తుతో రోడ్లు వేయాల్సి ఉందని పంచాయతీరాజ్ శాఖ మండల ఇంజినీర్ జావేద్ చెబుతున్నారు. సీసీ రోడ్లు కూడా టీడీపీ అనుయాయుల ఇళ్లు ఉన్న చోట్లే వేస్తున్నారని, జనవాసాలు లేని కళ్లాల్లో కూడా రోడ్లు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

క్యూరింగ్‌లో కక్కుర్తి..

సీసీ రోడ్లకు క్యూరింగ్ సరిగా చేయడం లేదని, క్యూరింగ్ కాకపోతే ఎక్కువ కాలం మన్నిక రాదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కనీసం 21 రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సి ఉందని కాంట్రాక్టర్ మాత్రం తూతూ మంత్రంగా చేస్తున్నారని వెల్లడించారు. నెహ్రూనగర్ గుండు తూము పాఠశాలకు వెళ్లే సంధులో వేసిన సీసీ రోడ్డుకు కట్టలు వేసి, అందులో నీరు పోయడం లేదని స్థానికులు తెలిపారు. అలాగే ఒకే ఒక ఇంటి సంధు అయిన టీడీపీ నాయకుని ఇంటి వరకు సీసీ రోడ్డు వేశారని ఆరోపణలున్నాయి. నాయీ బ్రాహ్మణుల ఇళ్ల మధ్య, 12వ వార్డు మెంబర్ ఇంటి సమీపాన ఉండే కొదవ రోడ్డుకు లింక్ కలపమంటే కలపడం లేదని స్థానికులు వాపోయారు. నెహ్రూనగర్‌లో పంచాయతీ తీర్మానం తీసుకోకుండానే సీసీ రోడ్డు పనులు చేపట్టి అవమానిస్తున్నారని దళిత సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీ వర్గీయులు హైకోర్టులో పిటిషన్ వేసినట్లు సమాచారం. ఏదిఏమైనా సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని క్వాలిటీ కంట్రోల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మా కాలనీలోని కొదవ పనులు చేయడం లేదు



వైఎస్సార్‌సీపీ మద్దతుతో 12వ వార్డు మెంబర్‌గా గెలిచాను. గ్రామంలో సీసీ రోడ్లు లేని కాలనీలను అధికారులు గతంలో గుర్తించారు. మా కాలనీలో కూడా దాదాపు 50 మీటర్లు కొదవ ఉంది. దానిని కూడా గుర్తించినప్పటికీ ప్రభుత్వం మారడంతో టీడీపీ వాళ్లు రోడ్డు వేయడం లేదు.

– నరసింహారాజు, 12వ వార్డు మెంబర్, నెహ్రూనగర్

క్యూరింగ్ సరిగా చేయడం లేదు



మా ఇంటి సంధులో సీసీ రోడ్డు వేశారు. క్యూరింగ్ సరిగా చేయడం లేదు. క్యూరింగ్ లేకపోతే మన్నిక రాదు. అధికారులు పర్యవేక్షించడం లేదు. అభివృద్ధి పనులంటే పది కాలాల పాటు పేరు చెప్పుకునేలా వేయాలి. అయితే ఇక్కడా అలా జరగడం లేదు. క్యూరింగే చేయడం లేదు. అందులో ఏ మేరకు సిమెంట్, ఇసుక, కంకర వేశారో దేవుడికే తెలియాలి.

– తలారి ఈశ్వరయ్య,నెహ్రూనగర్